పీసీసీ కుర్చీ కోసం భట్టి గట్టి పట్టు?

బీసీ నేతగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను బరిలోకి దింపిన సీఎం రేవంత్‌రెడ్డి

ఎంపీ ఎన్నికల ఫలితాల తరువాత అధిష్ఠానం నిర్ణయం

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): పీసీసీ అధ్యక్ష పదవిని చేజిక్కించుకునేందుకు రాష్ట్ర కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున లాబీయింగ్‌లు మొదలయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవి కూడా కీలకం కానున్నది. దీంతో అధిష్ఠానం పెద్దలను ప్రసన్నం చేసుకుని, ఈ పదవిని దక్కించుకునేందుకు ముఖ్యనేతలు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ ప్రయత్నాలు ఇప్పటికే జోరందుకున్నట్టు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ గురువారం గాంధీభవన్‌లో చేసిన వ్యాఖ్యలతో రూఢీ అయ్యింది. పీసీసీ చీఫ్ పదవిని దక్కించుకునేందుకు ఎస్సీ, బీసీ నేతలు ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండటంతో ఆయనకు సన్నిహితులైన, ఆయనను ఒప్పించగలిగిన నాయకుల దగ్గర లాబీయింగ్ మొదలు పెట్టినట్టు తాజా సమాచారం. పార్లమెంట్ ఎన్నికల తరువాత టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిని నియమించనున్నట్టు ఇప్పటికే అధిష్ఠానం సంకేతాలు ఇచ్చిన నేపథ్యంలో ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పీసీసీ చీఫ్ రేసులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముందు వరుసలో ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఖమ్మం ఎంపీ టికెట్‌ను తన సతీమణికి ఇప్పించుకునేందుకు చివరి దాకా ప్రయత్నించి భంగపడటంతో కనీసం పీసీసీ అధ్యక్ష పదవి అయినా తనకు ఇవ్వాలని భట్టి డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. పాత తరం కాంగ్రెస్ నేతలు కూడా భట్టికి మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిసింది. అధిష్ఠానాన్ని ప్రభావితం చేయగలిగిన నేతలతో భట్టి లాబీయింగ్ చేస్తున్నట్టు ఈ వర్గాల సమాచారం. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన మరుసటి రోజు భట్టి విక్రమార్క, మరో సీనియర్ నేత, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యి ఇదే అంశంపై చర్చించినట్టు తెలిసింది. కర్ణాటకలో పీసీసీ అధ్యక్ష పదవిలో అక్కడ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కొనసాగుతుండటంతో అదే తరహాలో తనకు కూడా ఇవ్వాలని భట్టి కోరుతున్నట్టు సమాచారం.

మహేశ్‌కుమార్‌గౌడ్ వైపు రేవంత్‌రెడ్డి మొగ్గు

ప్రస్తుత వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పీఠం కట్టబెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రిగా అగ్రకుల (రెడ్డి) సామాజిక వర్గం, డిప్యూటీ సీఎంగా, స్పీకర్‌గా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన (భట్టి విక్రమార్క, గడ్డం ప్రసాద్‌కుమార్) వ్యక్తులు ఉండటంతో పీసీసీ అధ్యక్ష పదవి బీసీ సామాజిక వర్గానికి ఇవ్వడం సముచితంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు తెలిసింది. ఇదే సామాజిక వర్గానికి చెందిన మధుయాష్కీగౌడ్ కూడా పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్నప్పటికీ, తనకు నమ్మకమైన వ్యక్తిగా మహేశ్‌కుమార్‌గౌడ్ వైపు రేవంత్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. తనకు సీఎం మద్దతు ఉండటంతో కచ్చితంగా కాబోయే పీసీసీ అధినేత తానేనని మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమాగా ఉన్నట్టు తెలిసింది. కాగా పార్టీకి మొదటి నుంచి విధేయుడిగా ఉండి, పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన తనకు సీఎం పదవి దక్కలేదని, తన భార్యకు ఎంపీ టికెట్ ఇవ్వలేదని, కనీసం తనకు పీసీసీ అధ్యక్ష పదవైనా ఇవ్వాలని భట్టి విక్రమార్క గట్టిగా పట్టుబడుతున్నట్టు తెలిసింది. రాహుల్‌గాంధీని ప్రసన్నం చేసుకునేందుకే ఆయన వెంటే ఉంటూ రాయబరేలి ప్రచారానికి భట్టి వెళ్లినట్టు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో ఇటీవల బెంగళూరులో సమావేశమైన సందర్భంగా కూడా తనకు పీసీసీ అధ్యక్ష పదవిని ఇవ్వాలని భట్టి కోరినట్టు ఆయన సన్నిహిత వర్గాల సమాచారం. ఈ అంశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే భట్టికి హామీ ఇచ్చినట్టు ఈ వర్గాల సమాచారం. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా భట్టి విక్రమార్క వైపు మొగ్గు చూపుతుండటంతో తనకు నమ్మకమైన వ్యక్తికి దక్కించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఏవిధంగా పావులు కదుపుతారో వేచి చూడాలి.

సీఎం అనని మాటలు అన్నట్టు ప్రచారం

- ధర్నాలు చేసేది రైతులు కాదు బీఆర్ఎస్ కార్యకర్తలు
- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): సన్నరకం వడ్లు పండించే రైతులకు మాత్రమే బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనని మాటను అన్నట్టుగా బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారం చేస్తున్నదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బీ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రైతుల పేరిట ధర్నాలు చేసింది రైతులు కాదని, బీఆర్ఎస్ కార్యకర్తలని ఆరోపించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో గురువారం మాజీ మేయర్ బొంతు రాంమోహన్, పీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు త్వరలో తీపికబురు చెప్పనున్నారని తెలిపారు. గత ప్రభుత్వం కంటే తాము ఎక్కువ సంఖ్యలో ఐకేపీ సెంటర్లు తెరిచి, ఎక్కువ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలు తమ ప్రభుత్వ నాలుగు నెలల పాలనలో సంతోషంగా ఉన్నారని చెప్పారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులకు ఏమైనా చేసిందని అని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్ష పదవి రేసులో తాను కూడా ఉన్నట్టు మహేశ్‌కుమార్‌గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్‌కే వస్తాయని చెప్పారు.

లోకం పోకడ

మీమీ శాఖలపై సమీక్ష జరపడానికి సహకరించిన మీ అందరికీ ధన్యవాదాలు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	41.5°c	21.5°c
నల్లగొండ	39.9°c	23.5°c
మహబూబ్‌నగర్	39.9°c	27.3°c
రంగారెడ్డి	39.8°c	23.0°c
మెదక్	38.8°c	20.9°c
వరంగల్	37.0°c	26.0°c
కరీంనగర్	37.0°c	26.0°c
హైదరాబాద్	36.8°c	23.2°c
నిజామాబాద్	35.9°c	25.1°c
ఖమ్మం	32.0°c	25.0°c

దేశం షాక్ అయ్యేలా వైసీపీ ప్రభంజనం

- 2019లో కంటే ఎక్కువ సీట్లు గెలుస్తాం
- ఐప్యాక్ ప్రతినిధుల భేటీలో ఏపీ సీఎం జగన్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీపీ ప్రభంజనం ఖాయమని, మళ్లీ తాము అధికారంలోకి రాబోతున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలను చూసి దేశం షాక్ అవుతుందని చెప్పారు. ప్రశాంత్‌కిశోర్ కూడా ఉహించలేనన్ని సీట్లు సాధించబోతున్నామని పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని బెంజిసర్కిల్‌లో ఉన్న ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) ప్రతినిధులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. సుమారు 25 నిమిషాలపాటు ఐప్యాక్ కార్యాలయంలో గడిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. 2019లో 151 సీట్లు, 22 ఎంపీ సీట్లు గెలిచామని, ఈ సారి అంతకంటే ఎక్కువ స్థానాలు గెలుస్తామని చెప్పారు. ఫలితాల తర్వాత దేశం మొత్తం ఏపీ వైపే చూస్తుందని పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ కోసం పొలిటికల్ కన్సల్టెన్సీగా ఐప్యాక్ పనిచేసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- సాగు కోసం రూ. 4 లక్షల అప్పు
- పండ ఎండడంతో మనస్తాపం
- మెదక్ జిల్లా నిజాంపేటలో ఘటన

ఎల్లయ్య(ఫైల్)

నిజాంపేట, మే 16 (నమస్తే తెలంగాణ): అప్పు చేసి సాగుచేసిన పంట కండ్లముందే ఎండిపోవడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక అన్నదాత ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా నిజాంపేటలో బుధవారం అర్ధరాత్రి జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గెరగంటి ఎల్లయ్య (45) తనకున్న మూడెకరాల భూమిలో యాసంగిలో వరి సాగుచేశాడు. సాగునీరు అందకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంట ఎండిపోయింది. సాగు కోసం చేసిన దాదాపు రూ. 4 లక్షల అప్పు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనోవేదనకు గురైన ఎల్లయ్య బుధవారం రాత్రి ఇంటిముందున్న వేపచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఎల్లయ్య భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నిజాంపేట ఎస్సై శ్రీనివారెడ్డి తెలిపారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్దమ్మాయి డిగ్రీ చదువుతుండగా, చిన్న కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతున్నట్టు పోలీసులు తెలిపారు.

'మెడికవర్'లో పసికందుకు అరుదైన శస్త్ర చికిత్స

కొండాపూర్, మే 16 : జననేంద్రియ అట్రేసియా వ్యాధితో బాధపడుతున్న పసికందుకు మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ దవాఖాన వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను గురువారం సీనియర్ పీడియాట్రిక్ సర్జన్ మధుమోహన్ రెడ్డి వెల్లడించారు. నాలుగు రోజులుగా పొత్తికడుపు వాపు, వాంతులతో బాధపడుతున్న 45 రోజుల పసికందును వైద్యం కోసం దవాఖానకు తీసుకొచ్చారు. పూర్తి పరీక్షలు నిర్వహించగా.. మూత్ర వ్యవస్థ, వెన్నుముక సమస్యలతో పాటు యోని అట్రేసియాతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వైద్య బృందం యోని పునర్నిర్మాణంతో పాటు వెనక భాగంలో ఓపెనింగ్ సృష్టించారు. ఐదు గంటలపాటు శస్త్రచికిత్స చేయగా, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ డాక్టర్లు వరలక్ష్మి, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంధ్య, హర్షిత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తల్లీ కొడుకు మృతి

మెదక్ జిల్లా ఉసిరికపల్లిలో బట్టలు ఆరేస్తుండగా ఘటన

మణెమ్మ, భానుప్రసాద్ (ఫైల్)

శివ్వంపేట, మే 16: బట్టలు ఆరేస్తుండగా ఓ మహిళ విద్యుదాఘాతానికి గురికాగా, ఆమెను కాపాడబోయి మరిది కొడుకు కూడా విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉసిరికపల్లిలో గురువారం జరిగింది. శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి మణెమ్మ(45) గురువారం ఉదయం బట్టలను ఇంటిముందు ఉన్న దండేనికి (జే-వైర్)పై ఆరేస్తున్నది. కాగా, గ్రామంలో రాత్రి కురిసిన వర్షానికి ఆ వైర్‌కు ఇంటి సర్వీస్ వైర్ తగలడంతో ఆమె విద్యుత్తు షాక్‌కు గురైంది. గమనించిన మణెమ్మ మరిది కొడుకు నీరుడి భానుప్రసాద్ (19) ఆమెను కాపాడేందుకు యత్నించగా అతడికి కూడా షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మణెమ్మ కూతురు శ్రీలత వచ్చి చూసే సరికి వారు కిందపడి ఉన్నారు. వారిని లేపే ప్రయత్నం చేయగా ఆమె కూడా కరెంట్‌షాక్‌కు గురైంది. వెంటనే స్థానికులు ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వారిని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే నీరుడి మణెమ్మ, నీరుడి భానుప్రసాద్ మృతిచెందారు. శ్రీలత స్వల్ప గాయాలతో బయటపడింది.

టీఎస్ స్థానంలో టీజీ

- తెలంగాణ వాహనాల రాష్ట్ర కోడ్ మార్పు
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం

హైదరాబాద్,మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ ప్లేట్లలో రాష్ట్ర కోడ్‌గా టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఇక నుంచి రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌లో రాష్ట్ర కోడ్‌ను టీజీ పేరుతో ఉండే విధంగా రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. నోటిఫికేషన్ ప్రకారం, సీరియల్ నంబర్ 29-ఏ, టీఎస్ కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కోసం వాహనాలపై రిజిస్ట్రేషన్ గుర్తు టీజీగా సవరించారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ 24కు వాయిదా

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): సీబీఐ కేసులో బెయిల్ కోరుతూ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 24కు వాయిదా పడింది. ఢిల్లీ హైకోర్టులో గురువారం జరిగిన విచారణ సందర్భంగా సీబీఐకి న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. 24వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

విద్యుత్తుపై అప్రమత్తంగా ఉండాలి

- టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఫారూఖీ

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, భారీ గాలుల నేపథ్యంలో విద్యుత్తు సరఫరాలో సమస్యలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సూచించారు. గురువారం విద్యుత్తు సరఫరా పరిస్థితిని ఆయన సమీక్షించారు. భారీ గాలుల ధాటికి చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీలు, భవన నిర్మాణ సామగ్రి, ఇతర వస్తువులు విద్యుత్తు లైన్లపై పడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విద్యుత్తు సరఫరాలో అత్యవసర సమస్యలు ఉంటే 1912, 100 నంబర్లతోపాటు స్థానిక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు సర్కిళ్ల వారీగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి, ఫిర్యాదులు చేసే విధంగా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

విద్యుత్తు ఒప్పందాలపై పది రోజుల్లో ఫిర్యాదు చేయండి

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందాలపై పది రోజుల్లోగా ఫిర్యాదు చేయాలని జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి కమిషన్ తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

బ్యాంకులు అప్పు ఇవ్వకుంటే రుణమాఫీ చేయరా?

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): బ్యాంకులు రుణాలు ఇవ్వకపోతే రైతు రుణమాఫీని అమలు చేయరా? అని బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రుణమాఫీని ఎగ్గొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో గత డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం ఇప్పుడు ఆగస్టు 15 నాటికి చేస్తానంటూ ఒట్లు వేశారని మండిపడ్డారు. ఇప్పుడు రుణమాఫీ కార్పొరేషన్ ఏర్పాటుచేసి, రుణాలు తీసుకొచ్చి మాఫీ చేస్తామని చెప్తున్నాడన్నారు. బ్యాంకు రుణాలు ఇవ్వకపోతే రుణాలు మాఫీ చేయరా? అని ప్రశ్నించారు. 'బ్యాంకు లోన్ ఇవ్వలేదు, కేంద్రం సహకరించలేదు' అంటూ సాకులు చెప్పి రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'అప్పు చేస్తారా, కడుపు కట్టుకుంటారా, ఆర్ఆర్ ట్యాక్స్ బంద్ చేస్తారా? అనేది రైతులకు సంబంధం లేదు. రుణమాఫీ మాత్రమే కావాలి' అని స్పష్టం చేశారు.

వరి కొయ్యలు తగలబెడితే జరిమానా

- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

హైదరాబాద్, మే 15(నమస్తే తెలంగాణ): వరి కొయ్యలు కాల్చే రైతులకు జరిమానా విధించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం పలు అంశాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రైతుకు పంటల బీమా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, విధి విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండోవిడత (ఏప్రిల్), మూడోవిడత (మే) జరిగిన పంట నష్ట వివరాలను వేగంగా అందించాలని పేర్కొన్నారు. పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఈ నెలాఖరుకు రిపోర్ట్ వచ్చేలా చూడాలని కోరారు. మార్క్‌ఫెడ్ ద్వారా మక్క, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సభ్యుల గుర్తింపు, పదవీకాలం ముగిసిన సహకార సంఘాలకు సత్వరమే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బీసీలకు వాటా ఇవ్వకపోతే తిరుగుబాటే: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే16 (నమస్తే తెలంగాణ): జనాభా దదామాషా ప్రకారం నిధులు, రిజర్వేషన్లలో బీసీల వాటా బీసీలకు ఇవ్వాలని, లేదంటే రాబోయే రోజుల్లో దేశంలో తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ భవన్‌లో 16 బీసీ సంఘాల ప్రతినిధులతో గురువారం ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. బీసీల అనుకూల వైఖరి అవలంబించి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, ప్రత్యేక మంత్రిత్వశాఖ, ఏటా 2లక్షల కోట్ల బడ్జెట్ బీసీల అభివృద్ధికి కేటాయిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, ఓయూ జేఏసీ నేత ఏనుగంటి రాజునేత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై అల్లరిమూక దాడి

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): సైడ్ ఇవ్వలేదని ఆరోపిస్తూ ఆర్టీసీ బస్సుపై యాభై మంది యువకులు విధ్వంసం సృష్టించారు. ఈ ఘటన హైదరాబాద్ శివారు రాచులూర్ గేట్ వద్ద గురువారం చోటుచేసుకున్నది. కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎంతసేపు హారన్ కొట్టినా సైడ్ ఇవ్వట్లేదంటూ బస్సును వెంబడించి, ఆపి మరి అద్దాలను ధ్వంసం చేశారు. దాడి ఘటనపై డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలానికి చేరుకొని బస్సును పరిశీలించారు. డ్రైవర్, కండక్టర్ తమ ఫోన్లలో తీసిన ఫోటోలు, బైక్ నంబర్ల ఆధారంగా యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఏపీలో హింసపై ఈసీ సీరియస్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనలను అదుపు చేయడంలో విఫలమైనందుకు పల్నాడు, అనంతపురం ఎస్పీలను సస్పెండ్ చేయడంతోపాటు శాఖాపరమైన విచారణకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తిరుపతి ఎస్పీపై బదిలీ వేటు వేసి, 12 మంది పోలీసు అధికారులపై సస్పెండ్ చేసింది. షోకాజ్ నోటీసులు అందుకున్న ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్‌గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ కుమార్ విశ్వజిత్ గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. ఓట్ల లెక్కింపు జరిగే వరకు ఎలాంటి హింసాత్మక ఘటనలు, అల్లర్లు జరగకుండా సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత కల్పించాలని హోంశాఖకు ఈసీ సూచించింది.

కొవ్వు కరిగించే మందంటూ తప్పుడు ప్రచారం

- 'శిలాజిత్' ట్యాబ్లెట్లను సీజ్ చేసిన డీసీఏ అధికారులు

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): 'శరీరంలో అధికంగా ఉన్న కొవ్వును, కిడ్నీలో రాళ్లను కరిగిస్తుంది' అంటూ తప్పుడు ప్రచారంతో విక్రయిస్తున్న ట్యాబ్లెట్లను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు సీజ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తనిఖీలు జరిపినప్పుడు 'శైలాజిత్ ఆయుర్వేద ట్యాబ్లెట్ల' పేరుతో విక్రయిస్తున్నట్టు గుర్తించామని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. వీటిని విజయవాడ గవర్నర్ పేటలో 'మనఫార్ ఆయుర్వేదిక్ డ్రగ్స్' అనే కంపెనీలో తయారు చేస్తున్నారని చెప్పారు. వీటి తయారీకి ఎలాంటి లైసెన్స్ లేదని, పైగా 1929 నుంచి ఈ ఔషధాన్ని అమ్ముతున్నట్టు ట్యాబ్లెట్లపై ముద్రిస్తున్నారని వెల్లడించారు. జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం చెట్టూర్‌లో రాజేశ్‌కుమార్ అనే ఆర్ఎంపీ 'శ్రీ వినాయక మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్' పేరుతో ఎలాంటి లైసెన్స్ లేకుండా మెడికల్ షాప్ నిర్వహిస్తున్నట్టు గుర్తించామని చెప్పారు. రూ.36 వేల విలువైన 49 రకాల మందులను నిల్వ చేయగా, మెడికల్ షాప్‌ను సీజ్ చేశామని వెల్లడించారు.

యాంటీ బయాటిక్స్ వాడకంపై ఆడిటింగ్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): యాంటీ బయాటిక్స్ విచ్చలవిడి వాడకాన్ని నియంత్రించాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ గురువారం అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. ప్రపంచవ్యాప్తంగా ఆందోళన రేకెత్తిస్తున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) ముప్పును తగ్గించేందుకు కొన్ని చర్యలు చేపట్టాలని కోరింది. విచ్చలవిడి యాంటీ బయాటిక్స్ వినియోగంతో వాటిని తట్టుకునేలా సూక్ష్మజీవులు మార్పులు చెందుతున్నాయని, సమీప భవిష్యత్తులో ఇప్పుడున్న యాంటీ బయాటిక్స్ పనిచేయవని హెచ్చరిస్తున్నది. ఈ స్థితినే ఏఎంఆర్ అని పిలుస్తున్నారని, దీనిని నియంత్రించే చర్యల్లో భాగంగా కేంద్రం రెండు ప్రధాన సూచనలు చేసింది.

కోడ్ ముగిశాకే పరిశ్రమలకు భూములు

- దరఖాస్తుల పరిశీలనకు టీఎస్ఐఐసీ నో
- 2 నెలలుగా పేరుకుపోయిన అప్లికేషన్లు
- కొత్త పాలసీపై ఔత్సాహికుల్లో ఉత్కంఠ

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల కారణంగా నిలిపివేసిన పరిశ్రమలకు భూకేటాయింపు ప్రక్రియను ఎన్నికల కోడ్ ముగిశాకే ప్రారంభించాలని టీఎస్ఐఐసీ నిర్ణయించింది. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయినందున ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకొని పెండింగ్ దరఖాస్తులకు భూకేటాయింపులు చేపట్టాలని పలువురు కోరినా, టీఎస్ఐఐసీ మాత్రం కోడ్ ముగిశాకేనని స్పష్టంచేసింది. రూ.200 కోట్లు.. అంతకన్నా ఎక్కువ పెట్టుబడి, వెయ్యి మందికి ఉపాధి అవకాశాలను సృష్టించే పరిశ్రమలకు రాష్ట్ర క్యాబినెట్ ద్వారా అనుమతి లభిస్తుంది. అంతకన్నా తక్కువ పెట్టుబడితో కూడిన పరిశ్రమలకు టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలోనే అనుమతులు జారీచేస్తారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో టీఎస్ఐఐసీ ప్రతి వారం భూకేటాయింపులు చేపట్టేది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తూ ప్రతి శుక్రవారం దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేసేది. అయితే, అసెంబ్లీ ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి ఈ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియలో మరింత జాప్యం జరిగింది. దీంతో భారీగా దరఖాస్తులు పేరుకుపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలకు మధ్య రెండు-మూడు వారాలు ఇంటర్వ్యూలు నిర్వహించిన